క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోటబొమ్మాళి: నిమ్మాడ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నేపథ్యంలో పెద్దబమ్మిడి ఎత్తిపోతల పథకంతో పాటు పెద్దబమ్మిడి, ఎత్తురాళ్లపాడు గ్రామాల గ్రానైట్ పరిశ్రమలకు శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బి.వి.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ, మర్రిపాడు, భావనపాడు పంచాయతీలోని పలు పోలింగ్ కేంద్రాలను టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్‌ఖమర్ గురువారం పరిశీలించారు. ర్యాంపు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈయనతో పాటు తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ మౌళి ఉన్నారు.

ధర్మనీలాపురంలో దంత వైద్య శిబిరం



దంతాలను పరీక్షిస్తున్న వైద్యులు

టెక్కలి రూరల్: టెక్కలి ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–3 సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ధర్మనీలాపురంలో ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ అనీషా గ్రామస్తులకు దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు తవ్వి వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ సతీష్ కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ డి.వాసుబాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అల్లుకోల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన

కాశీబుగ్గ: క్రమంతప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని వక్తలు పేర్కొన్నారు. పలాస మండలం అల్లుకోల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. అందుబాటులో ఉన్న వస్తువులతో పోషకాహార పదార్థాలు తయారు చేసి ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది కోట ఢిల్లీశ్వరి, దువ్వాడ నిర్మల, కుసిరెడ్డి శకుంతల, సచివాలయ ఉద్యోగులు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

పద్మనాభపురంలో కంటి వైద్య శిబిరం



కళ్లను పరీక్షిస్తున్న డాక్టర్ షీలా

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురంలో గురువారం ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రిన్సిపాల్ టి.ప్రవీణకుమారి ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ షీలా గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు ఎం.మాధురి, పి.జయమ్మ, పి.ఆనందరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విస్తృత ప్రచారం



సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీఎం ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు ఓటు హక్కుపై విస్తృత ప్రచారం కల్పిద్దామని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. గురువారం ఇచ్ఛాపురం మహిళా సమాఖ్య కార్యాలయంలో 'నీ ఓటు–నీ భవిష్యత్తు' కార్యక్రమంపై సీసీలు, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని, దాన్ని సద్వినియోగం చేసుకోవడం అందరి కర్తవ్యమని పేర్కొన్నారు.



వజ్రపుకొత్తూరు రూరల్: ఇంటింటా ప్రచారం చేస్తున్న ఉదయ్‌కుమార్, గురయ్యనాయుడు, పార్టీ నాయకులు



వజ్రపుకొత్తూరు: ఉండ్రుకుడియాలో ఇంటింటా ప్రచారం చేస్తున్న పాలిన శ్రీనివాసరావు, తమ్మినాన శాంతారావు



కాశీబుగ్గ: లేబరుకాలనీలో ప్రచారం చేస్తున్న నాయకులు అంబటి మాధురి, ఆనందరావు



టెక్కలి: చేరీవీధిలో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ హేమలత, జేసీఎస్ ఇన్‌చార్జి మోహన్, వార్డు సభ్యుడు రమణబాబు

సంక్షేమ పాలకులకే పట్టం కడదాం

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు
- ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిపై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్:

గత ప్రభుత్వ మాదిరిగా ఉత్తుత్తి హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయకుండా 58 నెలల వైఎస్సార్ సీపీ పాలనలో దాదాపు అన్ని హామీలను నెరవేర్చి అభివృద్ధి చేశామని, వచ్చే ఎన్నికల్లో తమను గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ కోరారు. గురువారం ఎం.తోటూరులో న్యాయవాది ఎం.రాంబాబు, వ్యాపారవేత్త పూర్ణరాళో కుటుంబీకులను కలిసి మద్దతు కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, ఎంపీపీ బోర పుష్ప, 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, ఎంపీటీసీ ఆశి మంధాకిని, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, కాళ్ల నారాయణ, ఆశి కృష్ణారెడ్డి, కృష్ణ చైతన్య, కాళ్ల దేవరాజులు పాల్గొన్నారు.

సీదిరిని మళ్లీ అసెంబ్లీకి పంపిద్దాం..

పలాస: పేదల పెన్నిధి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును మళ్లీ అసెంబ్లీకి పంపిద్దామని, అందుకు ప్రతి కార్యకర్త, లబ్ధిదారుడు తమ వంతు సహాయం అందించాలని మండల కమిటీ నాయకులు కోరారు. పలాస మండలం బంటుకొత్తూరు పంచాయతీలో గురువారం ప్రచారం నిర్వహించారు. గడప గడపకు కరపత్రాలు అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో పలాస మండల పార్టీ అధ్యక్షుడు పైల చిట్టిబాబు, ఉంగ సాయికృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చింతాడ మాధవరావు, బమ్మిడి దుర్యోధన, బమ్మిడి రవి, జి.మోహనరావు, దంతం వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే మద్దతు పలకాలి...

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు ప్రజా సంక్షేమం చేరువైందని, మరళా ఈ పథకాలు కొనసాగాలంటే ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీకే మద్దతు పలకాలని కోరుతూ టెక్కలి పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత, ఎంపీటీసీ పి.హేమలత, జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్, వార్డు సభ్యుడు పీత రమణబాబుతో పాటు కార్యకర్తలంతా చేరీవీధి ప్రాంతంలో 111 పోలింగ్ బూత్ పరిధిలో మేము సిద్ధం–మా బూత్ సిద్ధం ప్రచారం చేపట్టారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌ను గెలిపించడానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే భవిష్యత్

మందస: రాష్ట్ర భవిష్యత్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని ఉద్దానం ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు అన్నారు. మండలంలోని ఉద్దానంలోని పలు గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా పేరాడ తిలక్, ఎమ్మెల్యేగా డాక్టర్ సీదిరి అప్పలరాజును గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సర్పంచ్ బత్తిని తేజేశ్వరరావు, ఎంపీటీసీ గౌరకల పార్వతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సొర్ర ఢిల్లేశ్వరరావు, సరియాపల్లి సర్పంచ్ బత్తిని వెంకటరావు, డాక్టర్ వైఎస్సార్‌హెచ్‌యూ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణ్, క్లస్టర్ ఇన్‌చార్జి దున్న హరికృష్ణ, పార్టీ నాయకులు మడియా సోమేశ్, దున్న బుజ్జి, బొడ్డు చిన్నారావు, సార దూర్వాసులు, గుంటు రామస్వామి, మడియా రామకృష్ణ, పోలయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.



పలాస: బంటుకొత్తూరులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ప్రచారం

జోరుగా ఎన్నికల ప్రచారం

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉండ్రికుడియా, కంబాలరాయుడుపేట గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి తమ్మినాన శాంతారావు, మద్దిల హరినారాయణతో పాటు పార్టీ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. మంత్రి సీదిరి అప్పలరాజును గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వంక చిరంజీవి, కారి వెంకటరావు, కర్ని శ్రీను, కొర్ల వెంకటేష్, పార్టీ నాయకులు లండ రుద్రమూర్తి, కె.పీతాంబరం, లక్ష్మణరావు చంద్రశేఖర్, తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కడుదాం

వజ్రపుకొత్తూరు రూరల్: గత ఎన్నికల మేనిఫెస్టోలో 99 శాతం హామీలను నెరవేర్చి అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోమారు పట్టం కట్టి ప్రజా ప్రభుత్వాన్ని నిర్మించుకుందామని వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు అన్నారు. బాతుపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తామాడ సరస్వతి, వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు జోగి అప్పారావు, తిర్రి రాజారావు, కర్రి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

కోటబొమ్మాళి: సీఎం జగన్ పరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. గురువారం కోటబొమ్మాళి పంచాయతీ విద్యుత్‌నగర్‌లో మేము సిద్ధం–మాబూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లేశ్వరరావు, సర్పంచ్ కాల్ల సంజీవరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సుంకరి జనార్దన, వాన అసిరినాయుడు, బోయిన కృష్ణారావు, గొద్దు చిరంజీవి, బొడ్డు అప్పన్న, రాంపాత్రుని శివారెడ్డి, బొడ్డు చెంచులు, మెట్ట సింహాచలం, మూల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కాలనీలో ప్రచారం..

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో లేబర్‌కాలనీలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంకినమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఇంటింటా వెళ్లి సీదిరి అప్పలరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ అంబటి మాధురి, ఇన్‌చార్జి అంబటి ఆనందరావు, కొమర దేవరాజు, పైల నరసింహమూర్తి, గజ్జి బాలయ్య, కింతల బాబురావు, మూల దయాకర్, బమ్మిడి సుధాకర్, తిరునగరి శ్రీనివాస్, మద్దు కామేష్, సుబుద్ధి, కోనేరు కాళిదాస్, దుంప ప్రసాద్, దుప్పల శ్రీహరి, చొక్కర ధర్మారావు, తామాడ తులసీ, కృష్ణ మహరణ, కొల్లి మల్లేష్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి: విద్యుత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మందస: ఉద్దానంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఇచ్ఛాపురం రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకుంటే ప్రశాంతతతో పాటు సరైన జీవన శైలి సమకూరుతుందని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిరియా విజయ అన్నారు. సన్యాసిపుట్టుగలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠాపన సందర్భంగా గురువారం స్వామి వారిని, యజ్ఞ మండపాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ సల్ల సుగుణ, ఎంపీటీసీ సభ్యురాలు ఆశి మందాకిని, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి సల్ల దేవరాజు, నీలాపు చంద్రయ్య, రాంపత్ని చిట్టిబాబు, కాళ్ల దేవరాజు, కొప్పల హేమంత్, బుడత ప్రకాష్, నీలాపు గోపి, బాగ మోహనరావు, మాసునత్రి ఉమాపతి పాల్గొన్నారు.



వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న పిరియా విజయ

ఓటీపీఏ కార్యవర్గ ఎన్నిక

పలాస: ఆంధ్రప్రదేశ్ ఒరియా టీచర్స్ అసోసియేషన్ (ఓటీఏ) పలాస–వజ్రపుకొత్తూరు మండల శాఖ అధ్యక్షునిగా నల్ల నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలాస మండలం రెంటికోట ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం కేంద్ర కమిటీ కన్వీనర్ నల్ల గోవిందరాజు పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా చక్రపాణి ప్రధాన్‌గా వ్యవహరించారు. ముఖ్య కార్యదర్శిగా నాగేశ్వర్ పాత్రో, ఉపాధ్యక్షునిగా దుర్గాప్రసాద్ మహంతి, సంయుక్త కార్యదర్శిగా ఎస్.జనార్ధనరావు, కోశాధికారిగా బాలాజి పాత్రో, గౌరవ అధ్యక్షులుగా ఖగేశ్వరదొర, లక్ష్మీ నరసింహపండా, నీలకంఠ పాత్రో, చంద్రశేఖర్ బెహరా, విజయ పాణిగ్రాహి, మీనకేతన్ మిశ్రో, కృష్ణపాత్రో ఎంపికయ్యారు.



పలాసలో ప్రమాణస్వీకారం చేస్తున్న ఉపాధ్యాయులు

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న తహశీల్దార్ నాయుడు

పలాస: మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు కేంద్ర ఎన్నికల కమిషన్ సూచించిన ఎన్నికల నియమ నిబంధనలను విధిగా పాటించాలని పలాస తహశీల్దారు ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు చెప్పారు. పలాస తహశీల్దార్ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీల కటౌట్లు పెట్టాలనుకుంటే ముందుగా అనుమతి తీసుకోవాలని, చదర పు మీటరుకు రూ.15 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఇళ్లపై జెండాలు కట్టేందుకు కూడా అను మతి తప్పనిసరని, అందుకు కార్యకర్తలే డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ అభ్యర్థుల తరఫున కరపత్రాలు ప్రచురిస్తే ప్రింటింగ్ తదితర విషయాలు తెలియజేయాలన్నారు. ఖర్చు పెట్టిన ప్రతి పైసా కూడా ఎన్నికల ఖర్చు కింద చూపించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాల ని కోరారు. అనంతరం నాయకులు అడిగిన ప్రశ్న లు, సందేహాలను నివృత్తి చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొత్తూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని కొత్తూరుకు చెందిన శ్రీవెంకటేశ్వర విద్యా సంస్థల డైరెక్టర్ జి.కృష్ణారావు, గురండి సర్పంచ్ బోర సింహాద్రినాయుడు అన్నారు. మండలంలోని గురండి, పాతపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా గురువారం నాలుగో రోజు పాఠశాలలు, ఆలయాల పరిసరాల్లో వలంటీర్లు మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు ఏడాదికి ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఎన్ఎస్ఎస్ పీఓలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నగల మాయంపై ఫిర్యాదు

టెక్కలి రూరల్: టెక్కలిలోని గొల్లవీధికి చెందిన ఓ ఇంట్లో సుమారు నాలుగున్నర తులాల బంగారు నగలు నాలుగు రోజుల కిందట మాయమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గతంలో టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో సీపీఓగా పనిచేసిన కుమార్ అనే యువకుడు సదరు ఇంట్లో బాలికకు మాయమాటలు చెప్పి ఈ నగలు తీసుకెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా కాళీమాత ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న దక్షిణ కాళీమాత

ఇచ్ఛాపురం: పురపాలక సంఘంలోని డబ్బూరి వీధి దక్షిణ కాళీమాత ఆలయం మొదటి వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి తైల, సింధూర మర్దనలు, పంచగవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. చండీపారాయణం, హోమం నిర్వహించారు. సాయంత్రం 132 మందితో సామూహిక కుంకుమ పూజలు చేయించి అమ్మవారికి 36 ప్రత్యేక హారతి ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇన్విజిలేషన్‌లో అవకతవకలపై ఫిర్యాదు

టెక్కలి: పట్టణంలో పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్‌లో అవకతవకలు చోటు చేసుకున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు ఉపాధ్యాయులు గురువారం అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు.

పునరావాస కేంద్రం నిర్మాణానికి సాయం

కంచిలి: మండలంలోని మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం వద్ద నూతనంగా నిర్మిస్తున్న దివ్యాంగ చిన్నారుల పునరావాస కేంద్ర భవనం నిర్మాణానికి కవిటి పట్టణానికి చెందిన పాండవ రామారావు, మాజీ సర్పంచ్ పాండవ శేఖర్ సాయం చేశారు. రెండు వేల ఇటుకల్ని ఫౌండేషన్‌కు గురువారం సమకూర్చారు. నిర్వాహకుడు గుళ్ల రమేష్ వీరికి ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలపై నిర్లక్ష్యం తగదు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సమస్యలు పరిష్కరించడంలో నాయకులు నిర్లక్ష్యం వహించడం తగదని న్యాయవాది, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గ జిల్లా లీగల్ అడ్వయిజర్ జీఎంఎఫ్ అనిల్‌రాజ్ అన్నారు. కాశీబుగ్గలో జిల్లా మైనారిటీ నాయకులతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. పాలకులు తమను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారే తప్ప చిన్న చిన్న సమస్యలు సైతం పరిష్కరించడం లేదన్నారు. సమావేశంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిలర్ రాష్ట్ర కార్యదర్శి గంజి ఎజ్రా, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి అబ్రహం, బిషప్ సుందర్‌సింగ్, సూరాడ డానియల్, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎం.జోగారావు, లవకుశ, దాసరి ప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్‌రాజ్, మైనారిటీ నాయకులు

వీరగున్నమ్మపురంలో వైద్య శిబిరం

మందస: మండలంలోని వీరగున్నమ్మపురంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదిత్య కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో రాగోలు జెమ్స్ ఆసుపత్రి కి వైద్య నిపుణులు హాజరై 160 మంది ఎముకలు, కీళ్లవ్యాధులు, బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. గాయత్రి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొర్ల కన్నారావు రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పిన్సిపాల్ బొంగి ప్రవీణ్, పీఓలు కృష్ణారావు, సోమేశ్వరరావు, రవి, జెమ్స్ ఏరియా మేనేజర్ రాపాక తిరుపతిరావు, పీఆర్వో జెన్న మధు, కొంచాడ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

నిబంధనలకు అనుగుణంగా ప్రచురించాలి

ఇచ్ఛాపురం రూరల్: ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లను ఎన్నికల నియమావళిని అనుసరించి ముద్రించాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి బి.సుదర్శన్‌దొర అన్నారు. గురువారం తన కార్యాలయంలో ప్రింట్ అండ్ పబ్లిషింగ్ నిర్వాహకులతో సమావేశమయ్యారు. కరపత్రాలపై సంబంధిత ప్రెస్ కార్యాలయం చిరునామా తప్పనిసరిగా ముద్రించాలని సూచించారు. ఏ పార్టీకీ కించపరిచేలా ముద్రించరాదని, ముందుగా నాలుగు కరపత్రాలను స్థానిక నోడల్ అధికారికి, మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీకి అందజేయాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతియుత ఎన్నికలకు సహకరించాలని కోరారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్‌ఓ సుదర్శన్ దొర

లైన్‌మేన్‌పై దాడి!

టెక్కలి రూరల్: టెక్కలికి చెందిన ఒక పోలీస్ అధికారి తనపై దాడి చేశారంటూ అయోధ్యపురం పంచాయతీ పరిధి లైన్‌మేన్ రాజమహంతి సతీష్ తెలిపారు. తన అధికారి ఆదేశాల మేరకు టెక్కలి అయ్యప్పనగర్‌లోని కొన్ని ఇళ్ల బిల్లులు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో ఆ మీటర్లను పరిశీలించి లైన్ తీసేందుకు గురువారం మధ్యాహ్నం వెళ్లానని చెప్పారు. నంబర్ల ప్రకారం లైన్ పరిశీలిస్తుండగా అక్కడి వచ్చిన కొందరు మహిళలు ఎందుకు వచ్చారని అడిగారని, రెండు నెలలుగా బిల్లు కట్టకపోవడంతో కరెంట్ కట్ చేసేందుకు వచ్చామని చెప్పడంతో వారు బిల్లు ఇచ్చేయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. కొద్దిసేపటి తర్వాత పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్ రావడంతో తోటి సిబ్బందితో కలిసి స్టేషన్‌కు వెళ్లానని, అక్కడ ఉన్న అధికారి తనను పైనున్న గదికి తీసుకువెళ్లి తన ఇంటికే కరెంట్ కట్ చేసేందుకు వస్తావా అంటూ ఓ పోలీస్ అధికారితో కొట్టించారని వాపోయారు. గాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. ఈ ఘటనపై రూరల్ సీఐ సూర్యచంద్రమౌళి వద్ద ప్రస్తావించగా ట్రైనీ డీఎస్పీగా ఇటీవలే వచ్చిన అధికారి ఇంటి బిల్లు కట్టలేదని, లైన్ కట్ చెయ్యడానికి వచ్చారని తెలుసుకుని లైన్‌మేన్‌ను స్టేషన్‌కు పిలిచి కరెంట్ బిల్లు, కనీసం నోటీస్ సైతం ఇవ్వకుండా లైన్ ఎలా కట్‌చేస్తారని అడిగామని తెలిపారు. అంతేతప్ప అతనిపై దాడి చేయలేదని సీఐ 'సాక్షి'కి చెప్పారు.



తనను కొట్టారని చెబుతున్న సతీష్